కాదేదీ కబ్జాకు అనర్హం

- ఎస్ఎస్పీ కెనాల్‌నూ ఆక్రమిస్తున్న టీడీపీ పెద్దలు
- పోరంబోకులనూ వదలని వైనం


పెద్దకొత్తపల్లి రెవెన్యూ పరిధిలో ఎస్ఎస్పీ మైనర్ కాలువను పూర్తి చేసిన దృశ్యం


మద్దిపాడు రెవెన్యూ పరిధిలో ఎస్ఎస్పీ కెనాల్‌ను పూడ్చివేసిన దృశ్యం

మద్దిపాడు: ఆక్రమణలకు కాదేది అనర్హం అని కొందరు నిరూపిస్తున్నారు. తమ పరిధిలో వాగు పోరంబోకు కుంటలు ఆక్రమించేస్తున్నారు. ఏకంగా ఎస్ఎస్పీ మైనర్ కెనాల్‌నే ఆక్రమించారంటే అక్రమార్కులు ఎంతలా రెచ్చిపోతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇలా కాలువను టీడీపీ సానుభూతిపరులే ఆక్రమించడం గమనార్హం. మండలంలోని గురవారెడ్డి పాలెం, మద్దిపాడు, పెద్దకొత్తపల్లి సరిహద్దుల్లో ఎస్ఎస్పీ మైనర్ కెనాల్ ఉంది. సంతనూతలపాడు మండలం లక్ష్మీపురం వద్ద ఈ ఎస్ఎస్పీ కెనాల్ నుంచి లక్ష్మీపురం, రుద్రవరం, గురవారెడ్డి పాలెం, మద్దిపాడు గ్రామాల్లోని పొలాలకు నీరు అందించడానికి మైనర్ కాలువ నిర్మించారు. అలాగే వాటిపై చప్టాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కొందరు రైతులు తమ పొలంలో నుంచి వెళ్లిన మైనర్ కెనాల్‌ను పూడ్చివేసి కింది వారికి నీరు అందకుండా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తమను అడిగేది ఎవరంటూ సదరు రైతులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మిగిలిన వారు తెలిపారు. ఇలా ప్రభుత్వం అధికారంలోకి రావడం అలా ఆక్రమణలు చేసేయడం జరిగిపోయింది. ఇదే కెనాల్‌పై మూడు ప్రదేశాల్లో సుమారు 500 మీటర్ల మేర ఆక్రమించి వారి పొలాల్లో కలిపేసుకున్నారు. ఎస్ఎస్పీ కాలువ ఏర్పాటు చేసే సమయంలో రైతులందరి వద్ద ఎల్ఏ ద్వారా భూముల సేకరణ జరిగింది. కాలువకు పొలాలు ఇచ్చిన రైతులందరికీ ప్రభుత్వం డబ్బు చెల్లించింది. కానీ ప్రభుత్వం మారిన వెంటనే ఇటువంటి ఆక్రమణలు చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆయకట్టి చివరి భూములకు నీరు అందించే విషయమై ఏర్పాటు చేసిన కాలువను ఆక్రమిస్తే కాలువ చివర ఉన్న రైతుల పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. అధికారం అండదండలుండటంతో తమపైనే కేసు నమోదు చేస్తారంటూ మిగిలినవారు మారు మాట్లాడటం లేదు. ఈ విషయమై ఏఈ అనూషను వివరణ కోరగా.. తాను ఇటీవల బదిలీల్లో వచ్చానని.. మేజర్ కాలువలు పరిశీలించామని.. మైనర్లు ఇంకా పరిశీలించలేదని సమాధానం చెప్పారు. ఆక్రమణలకు గురైన విషయం తనకు తెలియదని.. కాలువలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు కలెక్టర్ సన్మానం


సంతనూతలపాడులో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న కలెక్టర్ అన్సారియా

సంతనూతలపాడు: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా గ్రామీణ పారిశుద్ధ్యరంగంలో విశిష్ట సేవలందించిన ఘనంగా సన్మానించారు . అనంతరం స్వచ్ఛభారత్ (గ్రామీణ) ప్రకాశం జిల్లా గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్ (ఆర్డబ్ల్యూఎస్), జిల్లా పరిషత్ ముఖ్య కార్యాలయ నిర్వహణ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, ప్రాజెక్టు డైరెక్టర్ డ్వామా, జిల్లా వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పంటలకు బీమా తప్పనిసరి


కొప్పోలులో వరిపంట పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: ప్రతి ఒక్క రైతు వరి, శనగ, మినుము పంటలకు బీమా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు కోరారు. మంగళవారం ఒంగోలు మండలంలోని కొప్పోలు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎరువులు కావాల్సిన రైతులు వ్యవసాయశాఖ సిబ్బందిని కలిసి తమకు ఏయే రకాల ఎరువులు కావాలో అడిగి తెప్పించుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. రైతులంతా పంట నమోదు కార్యక్రమాన్ని చేయించుకోవాలన్నారు. సూక్ష్మధాతు మూలకాలు కూడా సబ్సిడీలో త్వరలో ఇస్తామని తెలిపారు. వరి,శనగ సాగులో తీసుకోవాల్సిన మెళకువలు, ఖర్చు తగ్గించుకోవడానికి తీసుకోవాల్సిన పద్ధతుల గురించి రైతులకు సూచించారు. అనంతరం వ్యవసాయశాఖ సిబ్బందితో వరిపంటను పరిశీలించారు. వరి పంటలో ఆకుముడత ఎక్కువగా ఉన్నట్లు గమనించి, దాని నివారణకు క్యాట్ ఆఫ్ హైడ్రోక్లోరైడ్ ఒక లీటరు నీటికి రెండు మిల్లీమిటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసనాయక్, ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రమేష్‌బాబు, ఏఓ కిషోర్ బాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాధవి, వ్యవసాయ విస్తరణ అధికారులు రామకృష్ణారెడ్డి,ఆదిమూర్తి, వీఏఏ హిమబిందు, రవిచంద్ర, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరి


క్లాప్ మిత్రలకు సన్మానం చేస్తున్న ఎంపీడీఓ శ్రీకృష్ణ

ఈతముక్కల (కొత్తపట్నం): ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉంటే ఆ గ్రామం, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ శ్రీకృష్ణ తెలిపారు. ఈతముక్కల సచివాలయం-1లో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించుకోవాలన్నారు. ఆరుబయట మలవిసర్జన చేయకూడదని అనేక రోగాలు వస్తాయన్నారు. మన ఇల్లు శుభ్రంగా ఉంటే మన గ్రామం, మండలం, దేశం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. ఈవోఆర్డీ గోపాల్‌కృష్ణ మూర్తి మాట్లాడుతూ క్లాప్ మిత్రాలు ప్రతి రోజూ గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలన్నారు. ఆర్‌డబ్ల్యూస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ మరుంగుదొడ్డి లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్లాప్ మిత్రలను శాలువాతో సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి, సచివాలయం సిబ్బంది ఎంఆర్‌సీ కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల్యంలోనే చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్‌బాబు

కొత్తపట్నం: బాల్య వయస్సులోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై సుధాకర్‌బాబు అన్నారు. స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో బంగారు బాల్యం అనే కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వయస్సులోనే చట్టాలు గురించి తెలుసుకుంటే వారి మోసపోకుండా ఉంటారన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా బాలలకు మంచి కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. హెచ్ఎం మన్నెం శ్రీదేవి, స్కాట్ ఉపాధ్యాయుడు వెంకటశేషారావు పాల్గొన్నారు.

మైనర్లకు బైకులు ఇవ్వవద్దు

ఒంగోలు టౌన్: పిల్లల భవిష్యత్తును కాపాడుకోవలసిన బాధ్యత తలిదండ్రులపై ఉందని, నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ సీఐ పాండురంగారావు సూచించారు. మంగళవారం మంగమూరు రోడ్డు జంక్షన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. మైనర్ పిల్లలకు బైకు ఇవ్వడం నేరమని తెలిసి కూడా చాలా మంది తమ పిల్లలకు ఇస్తున్నారని చెప్పారు. ఇటీవల కొప్పోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకేసారి ముగ్గురు చిన్నారులు ప్రాణాలు పోగొట్టుకోవడాన్ని గుర్తు చేశారు. నంబర్ ప్లేట్లు లేకుండా ద్విచక్ర వాహనాలు , ఆటోలు నడుపుతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకుంటే అది మీ ప్రాణాలను రక్షిస్తుందని చెప్పారు. నగరంలో బైకు రేసింగులు జరుగుతున్నాయని, బైక్ రైసింగులను డ్రోన్ కెమెరాల ద్వారా, మఫ్టీ పోలీసుల ద్వారా నిఘా పెట్టినట్లు తెలిపారు.

ఘనంగా నాయీబ్రాహ్మణ కార్తీక వన సమారాధన


కార్తీకమాస వన సమారాధన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నాయీ బ్రాహ్మణులు

ఒంగోలు సిటీ: నాయీబ్రాహ్మణ కార్తీక వన సమారాధన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భోజనాల కార్యక్రమం యరజర్ల, కందులూరు గ్రామాల మధ్యన ఉన్న వీఆర్ఎన్‌కె గ్రీన్‌సిటీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని సుమారు 1500 మందికి పైగా నాయీబ్రాహ్మణులు హాజరైనట్లు ఒంగోలు పట్టణ క్షౌ వరశాల సంఘం అధ్యక్షుడు కొణిజేటి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు పథకం వాసుబాబు, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరు బాల గురుస్వామి, ఒంగోలు ప్యాకింగ్ ఇండస్ట్రీస్ అధినేత గోనుగుంట శేషారావు, ఉప్పుటూరి ఆదినారాయణ, నాయీబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నాదెండ్ల రాఘవ, సంఘ సభ్యులు బూసరపల్లి శ్రీను, అన్నంగి సురేష్, కరవది వేణు,కలవకూరి శివ, వాసు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణ క్రతువు దృశ్యం

ఒంగోలు మెట్రో: స్థానిక మదర్ థెరీసా కాలనీలో భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామివార్షికోత్సవ కల్యాణ మహోత్సవం మగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.


సంతనూతలపాడు: ఆటలు ఆడుతున్న విద్యార్థులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

సంతనూతలపాడు: స్థానిక శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఎస్ఎస్ఎన్‌కేసీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ ఎమ్.ప్రమోద ముఖ్య అతిథిగా విచ్చేశారు. మొదటగా భారత మొదటి మహిళా ప్రధాని భారత రత్న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్. ప్రమోద, హెడ్ మాస్టర్ మాట్లాడుతూ మహిళా చట్టాల గురించి హక్కుల గురించి వివరించారు. పోటీలకు షేక్ సిందాని బేగం టీచర్ (హిందీ) న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. గ్రంథ పాలకుడు కె. సత్యనారాయణ పాల్గొన్నారు.

చీమకుర్తి: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం చీమకుర్తిలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, నియోజకవర్గ ఇన్‌చార్జి పాలపర్తి విజేష్‌రాజ్ ఆధ్వర్యంలో పార్టీకి చెందిన మండల స్థాయి నాయకులు తుమ్మల సుబ్బారావు, శివశంకర్ నివాళులర్పించారు. పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఇందిరా గాంధీ చేసిన సేవలను కొనియాడారు.

మద్దిపాడు: మండలంలోని ఏడు గుండ్ల పాడు శాఖ గ్రంథ పాలకురాలు రోహిణి ఆధ్వర్యంలో మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. తొలుత భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మ్యూజికల్ చైర్స్.. లెమన్, స్పూన్ తదితర ఆటల పోటీలు జరిగాయి. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్లు రోహిణి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఉషారాణి పలువురు విద్యార్థులు వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు



ఏడుగుండ్ల పాడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

వాహనదారులకు లైసెన్స్ ఉండాలి


సంతనూతలపాడులో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ శ్రీకాంత్ బాబు

సంతనూతలపాడు: లైసెన్సులు లేని వాహనదారులకు సంతనూతలపాడులోని శివాలయం వద్ద ఒంగోలు రూరల్ సీఐ ఎస్. శ్రీకాంత్ బాబు మంగళవారం అవగాహన కల్పించారు. 15 ఆటోలకు జరిమానా విధించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

సంతనూతలపాడు: ఎస్ఎస్ఎన్‌కేసీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒంగోలు రూరల్ సర్కిల్ సీఐ ఎన్. శ్రీకాంత్ బాబు పర్యవేక్షణలో విద్యార్థులకు సైబర్ క్రైమ్, డ్రగ్స్, ట్రాఫికింగ్ తదితర అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 1930 కి కాల్ చేయాలని తెలిపారు. హెచ్ఎం ప్రమోద ఏఎస్ లు వెంకట్రావు, వెంకటలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.